క్లుప్తంగా

బోయపాలెంలో చలివేంద్రం ప్రారంభం



యడ్లపాడు: మండలంలోని పారిశ్రామికవాడ బోయపాలెం గ్రామంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామంలోని విశ్వతేజ నూలుమిల్లు, ఆకి శివవెంకటేశ్వర్లు సంయుక్త ఆధ్వర్యంలో వేసవి రెండు నెలలపాటు ఉండే ఈ చలివేంద్రాన్ని నూలుమిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్, మిల్లు జేడీ కాకరపర్తి రమేష్, వంకాయలపాడు గ్రామ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు, కుర్ర రత్తయ్య ప్రారంభించారు. చలివేంద్రంలో మినరల్ కూలింగ్ వాటర్‌ను అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసనాయక్, ఉన్నవ, బోయపాలెం గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘర్షణలో 8 మందికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: ఒక సామాజికవర్గంలోని రెండుగ్రూపుల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఫలితంగా 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మిట్టపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మిట్టపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం ఒక గ్రూపునకు చెందిన వారు తమకు సమాచారం లేకుండా వేరే చోట జరిగిన కర్మకాండలకు హాజరయ్యారని వివాదం చెలరేగింది. మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు పరస్పరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నాదెండ్ల: సాతులూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఫిరంగిపురం ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డీఈఈ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ మండల పరిధిలోని సాతులూరు, చందవరం, గోరిజవోలు, డెయిరీ ఇండస్ట్రీ, పెయింటింగ్ గోడౌన్స్, నరసరావుపేట రూరల్ దొండపాడు, పానుగుపాడు గ్రామాల్లో గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ సరఫరాల్లో అంతరాయం కలుగుతుందని వివరించారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్, సబ్ రిజిస్ట్రార్ రోడ్డు, అర్బన్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, వాసవి నగర్, ఆర్యవైశ్య కల్యాణమండపం, గాంధీపేట, చౌత్రాసెంటర్, విజయబ్యాంక్ సెంటర్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల



బొల్లాపల్లి : మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో నీలంపాటి అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కుంకుమ ప్రభలు ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు.

వర్ష బాధితులకు పరామర్శ



రొంపిచర్ల : రొంపిచర్ల శివాలయం కాలనీలో అకాల వర్షాలకు దెబ్బతిన్న ముక్కదాల నాగేశ్వరరావు ఇంటిని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులను ఆదుకుంటామని వివరించారు. హౌసింగ్ స్కీమ్ ద్వారా కొత్తగా ఇల్లు కట్టుకోవడానికి ఉత్తర్వులు జారీ చేస్తామని వివరించారు. దీనిపై రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల అధికారులు నివేదిక తయారుచేసి పంపాలని ఆదేశించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.20వేల నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, తహసీల్దార్ జి.అంకారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వీఆర్‌ఓ పడాల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కురుగుంట శ్రీనివాసరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, గెల్లి కోటిరెడ్డి, గుండాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి మేలు మలుపల్లె



కలెక్టర్ నుంచి పురస్కారాలు అందుకుంటున్న శానంపూడి సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, కొండ్రముట్ల సర్పంచ్ ఉయ్యాల వెంకటమ్మ, ఇర్లపాడు సర్పంచ్ మంగు రమాదేవి, తూబాడు సర్పంచ్ గోళ్ళమూడి కాశయ్య

- జిల్లా ఉత్తమ పంచాయతీలుగా శానంపూడి, కొండ్రముట్ల, ఇర్లపాడు, తూబాడు
- కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న సర్పంచ్‌లు

శావల్యాపురం/నాదెండ్ల/ఈపూరు/చిలకలూరిపేట టౌన్/యడ్లపాడు/బొల్లాపల్లి: పలు పంచాయతీలు ప్రగతికి మేలు మలుపల్లె నిలిచాయి. ఉత్తమ పనితీరుతో జిల్లాస్థాయిలో సత్తాచాటి పురస్కారాలు అందుకున్నాయి. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా పలువురు సర్పంచ్‌లు పురస్కారాలు అందుకున్నారు. శావల్యాపురం మండలం శానంపూడి మౌలిక సదుపాయాల కల్పనలో కనబరిచిన ప్రతిభకు ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. దీంతో గ్రామ సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్ కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం, సత్కారం పొందారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అధికారులు సర్పంచ్, కార్యదర్శిని అభినందించారు.

• మెరుగైన జీవనోపాధుల విభాగంలో ఈపూరు మండలం కొండ్రముట్ల జిల్లా ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో కొండ్రముట్ల సర్పంచ్ ఉయ్యాల వెంకటమ్మ కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఎంపీడీఓ ఉషాకిరణ్ తదితరులు అధికారులు సర్పంచ్‌ను అభినందించారు.

• నాదెండ్ల మండలంలో రెండు పంచాయతీలు జిల్లా ఉత్తమ పురస్కారాలు సాధించాయి. పథకాల అమలు, ఉత్తమ సేవల విభాగంలో ఇర్లపాడు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనలో తూబాడు అవార్డులు పొందాయి. ఇర్లపాడు సర్పంచ్ మంగు రమాదేవి, తూబాడు సర్పంచ్ గోళ్లమూడి కాశయ్య, కార్యదర్శులు ఎస్.మాధవి, జంగు జరీనాలు కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు.

• చిలకలూరిపేట మండల స్థాయిలో పలు పంచాయితీలను ఉత్తమ అవార్డులకు ఎంపికచేసినట్టు ఎంపీడీవో వి.హేమలతాదేవి చెప్పారు. దండమూడి, వేలూరు, కుక్కపల్లివారిపాలెం, లింగంగుంట్ల, కావూరు, కట్టుబడివారిపాలెం, గోపాలవారిపాలెం గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు.

• యడ్లపాడు మండలంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షత వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ బి.వరూధిని, ఏవో సాయిశ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం మండల స్థాయిలో ప్రతిభ చూపిన పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులకు సేవా అవార్డులు ప్రదానం చేశారు. వందశాతం పన్నులు వసూలు చేసిన గుత్తావారిపాలెం పంచాయతీ గ్రామ కార్యదర్శి జి.అనితను ఎంపీపీ ఝాన్సీ అభినందించి సత్కరించారు.



నాయుడుపాలెం సర్పంచ్‌ని అభినందిస్తున్న దృశ్యం

• బొల్లాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పలు పంచాయతీలకు ఉత్తమ సేవా అవార్డులు అందించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జన నినాదం.. జగనన్నే మా భవిష్యత్

- పీపుల్స్ సర్వేలో ప్రజాస్పందన అద్భుతం
- నియోజకవర్గంలో 75 శాతం కుటుంబాల చెంతకు వెళ్లాం
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి ఒక్క కుటుంబం జగనన్నే తమ భవిష్యత్ అని నినదిస్తోందని, రాబోయే రోజుల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సంక్షేమ ప్రభుత్వంపై ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. సోమవారం నరసరావుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల ఏడో తేదీ నుంచి నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగిన తీరును వివరించారు. ఇంటింటా ప్రజల నుంచి అద్భుత స్పందన వచ్చిందని వెల్లడించారు. మెగా పీపుల్స్ సర్వే ద్వారా రాష్ట్రంలో కోటి కుటుంబాలను కలిస్తే.. నియోజకవర్గంలో 65,187 కుటుంబాలను కలిశామని వెల్లడించారు. మొత్తం 87,546 కుటుంబాలు ఉంటే 75 శాతం ఇళ్లకు వెళ్లామని వివరించారు. రానున్న రోజుల్లో మిగిలిన 25 శాతం కుటుంబాలను కలుస్తామని పేర్కొన్నారు. పీపుల్స్ సర్వేలో క్లస్టర్ ఇన్‌చార్జులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారని, ప్రజల నుంచి వస్తున్న స్పందన పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నింపుతోందని గోపిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఉలిక్కి పడుతున్నాయని, ఉద్యోగులు, చదువుకున్న వారు వ్యతిరేకంగా ఉన్నారనే దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారనే దానికి ఇటీవల విడుదలైన టైమ్స్ నౌ సర్వే ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. వంద శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం తమదని, మే ఒకటో తేదీన టిడ్కో గృహాలను ఉచితంగా లబ్ధిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యులు పిల్లి ఓబులురెడ్డి, నరసరావుపేట, రొంపిచర్ల ఎంపీపీలు మోరబోయిన సుబ్బాయమ్మ శ్రీనివాసరావు, గడ్డం బాలనాగమ్మ వెంకటరావు, రొంపిచర్ల మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, యాంపాటి వెంకటప్పారెడ్డి, రాంబాబుచౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చిత్రంలో పార్టీ నాయకులు

నవ రసాలు పండించిన 'నాన్న నేనొచ్చేస్తా'

- ముగిసిన కొండవీడు కళా పరిషత్ 24వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక
- ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా చీకటి పువ్వు, థింక్ నాటికలు

యడ్లపాడు: కళా సంబరం ముగిసింది. లింగారావుపాలెంలో 'కొండవీటి కళా పరిషత్' కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు తెరపడింది. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో పోసాని సుబ్బారావు కళా వేదికపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని కళా సంస్థలు 9 నాటిక ప్రదర్శనలిచ్చాయి. నవరత్నాల్లాంటి నాటికల్లో ఉత్తమ ప్రదర్శన, వ్యక్తిగత బహుమతులను కమిటీ సభ్యులు అందించి, సత్కరించారు. న్యాయ నిర్ణేతలు జీఎస్ ప్రతాప్‌రెడ్డి, కొంతినేని కిషోర్, అంచూరి నర్సిరెడ్డి బహుమతుల వివరాలు వెల్లడించారు.

'నాన్న నేనొచ్చేస్తా'కు ఐదు బహుమతులు

గుంటి రాజేశ్వరీ మూల కథకు తాళ్ల బత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేసి, అమృతలహరి దర్శకత్వం వహించిన శ్రీ అమృతలహరి థియేటర్స్ ఆర్ట్స్ (గుంటూరు) వారి ''నాన్నా నేనొచ్చేస్తా'' నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని కైవసం చేసుకుంది. ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అమృత వర్షిణి, ఉత్తమ సహాయ నటుడిగా ఎస్‌కేడీ హసన్, ఉత్తమ హాస్య నటుడిగా టి.వెంకటేశ్వరరావు, ఉత్తమ రచయితగా టి.వెంకటేశ్వరరావుకు బహుమతులు దక్కాయి.

'చీకటి పువ్వు' నాటికకు ఐదు బహుమతులు

పరమాత్ముని శివరాం రచనకు మంచాల రమేష్ దర్శకత్వం వహించి చైతన్య కళాభారతి (కరీంనగర్) వారి నాటిక 'చీకటి పువ్వు' ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా నిలిచింది. ఉత్తమ దర్శకుడిగా మంచాల రమేష్, ఉత్తమ సంగీత దర్శకుడిగా నాగరాజు, ఉత్తమ నటిగా గుడివాడ లహరి, ప్రత్యేక జ్యూరీ అవార్డును గిరిబాబు అందుకున్నారు.



ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక దర్శకురాలు అమృతవర్షిణి

'థింక్' నాటికకు నాలుగు..

మంజూనాథ రచన, దర్శకత్వం వహించి సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) వారి నాటిక 'థింక్' ఉత్తమ తృతీయ ప్రదర్శనగా నిలిచింది. ఉత్తమ నటుడిగా సతీష్‌కుమార్, ఉత్తమ ఆహార్యం అమృత వర్షిణి, ప్రత్యేక జ్యూరీ అవార్డు వేణుగోపాల్‌కు లభించాయి.

'రైతే రాజు'కు రెండు అవార్డులు..

కంచర్ల సూర్య ప్రకాష్ రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన కళాంజలి (హైదరాబాద్) వారి ''రైతేరాజు'' నాటిక ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనకు ఎంపిక కాగా, ఇందులో నటించిన ఏపూరి శ్రీనివాస్‌కూ ప్రత్యేక జ్యూరీ అవార్డు రావడం గమనార్హం. రంగాలంకరణ ఎస్.రామమోహన్‌రావు (వెండి అంచులు), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఎస్.వెంకటేశ్వర్లు (స్థిరాస్తి), ఉత్తమ సహాయ నటులు, జీఎన్‌డీ కుసుమ సాయి(కాపలా), ఉత్తమ విలన్ గోప రాజు విజయ్ (ప్రేమతో నాన్న), ప్రత్యేక జ్యూరీ అవార్డులను ఎన్.సూర్య(అస్థికలు), వసంతయామిని (వెండి అంచులు), ఇ.భాగ్యరాజ్(కాపలా) అందుకున్నారు. కార్యక్రమాన్ని పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శ్రీహరిరావు, మండెపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తోకల సాంబ శివరావు, నంబూరి వీరాంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రంగస్థల, సినీ దర్శక రచయిత జరుగుల రామారావు పర్యవేక్షించారు.

కొమరవల్లిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా కొండవీటి బాధ్యతలు

చిలకలూరిపేటటౌన్: రైతులకు సొసైటీ ద్వారా రుణాలు మంజూరుకు కృషి చేస్తానని కొమరవల్లిపాడు పీఏసీఎస్ చైర్మన్ కొండవీటి ఆంజనేయులు చెప్పారు. సోమవారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ తనకు పదవి రావటానికి కృషి చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా వేములయ్య, అంజిరెడ్డి, అల్లీమియా తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ వల్ల ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం'

చిలకలూరిపేటటౌన్: దేశంలో బీజేపీ ప్రభుత్వం వల్ల ప్రజాస్వామ్యం ప్రశార్థకంగా మారిందని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు సుబ్బాయమ్మ విమర్శించారు. మతోన్మాద బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సీపీఐ, సీపీఎం నాయకులు సోమవారం ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. ప్రచారభేరి కార్యక్రమం ముగింపు సభ మంగళవారం సాయంత్రం కళామందిర్ సెంటర్‌లో నిర్వహించనున్నామని వివరించారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తాళ్లూరి బాబురావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, పేలూరి రామారావు, చెరుకుపల్లి నిర్మల, సాతులూరి బాబు, భగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో జగనన్నే మా భవిష్యత్

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో సోమవారం వలంటీర్లు, గృహసారథులు సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. నాయకులు ఇంటింటికీ తిరిగి నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అమలైన సంక్షేమ పథకాల గురించి వివరించారు. గృహ యజమానుల అనుమతితో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ ఆదంవలి, తులం సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మేడూరి మధు, ఆంజనేయులు, కోటేశ్వరరావు, వీరయ్య, గాలి హనుమంతరావు, నార్నె శివ పాల్గొన్నారు.



గణపవరంలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న గృహ సారథులు, నాయకులు

నివేశన, సాగు భూములు ఇవ్వాలని వినతులు

యడ్లపాడు: నివేశన స్థలాలను మంజూరు చేయాలంటూ సోమవారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో పలువురు వినతిపత్రాలు సమర్పించారు. మండలంలోని జగ్గాపురం ఎస్టీ కాలనీకి చెందిన 45 కుటుంబాలకు నివేశన స్థలాలు లేవంటూ ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎన్. నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డికి జగ్గాపురం ఎస్టీలు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్టీ కాలనీ సమీపంలో సర్వే నంబర్ 312/బీ1లో 1ఎకరా 50 సెంట్ల స్థలం ఉందని, వాటిని అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. మండలంలో ఉన్న మిగులు భూములు 150 ఎకరాలను సాగు కోసం కుటుంబానికి 2 ఎకరాలు చొప్పున పంపిణీ చేయాలని కోరారు. ఎస్టీ కమ్యూనిటీ హాలు శిథిలావస్థలో ఉందని, కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయించి బాగు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక సభ్యులు మొగిలి తిరుపతిరావు, మొగలి ఏడుకొండలు, బి.చిన్న నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, ఎస్టీ కాలనీవాసులు వి.పోలయ్య, కె.శ్రీనివాసరావు, కె.రామకోటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులే మంచి పేరు తెస్తాయి



పమిడిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



పేరూరుపాడులో ప్రార్థన మందిరం నిర్మాణానికి సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి : గ్రామపంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులే పాలకులకు మంచిపేరు తెచ్చిపెడతాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చెప్పారు. మండలంలోని పమిడిపాడు గ్రామ సర్పంచ్ కొత్త ఆదిలక్ష్మి సెలవుపై వెళ్లడంతో ఉపసర్పంచ్ కొణతం బాలిరెడ్డి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టనున్న దృష్ట్యా అభినందన సభ ఏర్పాటు చేశారు. సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా సర్పంచ్‌లు పనిచేయాలన్నారు. ప్రస్తుతం వినుకొండ పట్టణంలో నీటి సమస్య లేకుండా చేశామని, పట్టణాన్ని సుందరంగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. బొల్లాపల్లి మండల ఆవశ్యకతను గుర్తించి వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నామని, అన్ని అనుమతులూ రాగానే త్వరలో నిర్మాణం చేపడతామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకానికి రూ.1,273 కోట్లు కేటాయించారని చెప్పారు. నాగార్జున సాగర్ నుంచి పల్నాడు జిల్లాలోని వినుకొండ, నరసరావుపేట, గురజాల, మాచర్ల వంటి నియోజకవర్గాల్లోని మండలాలకు తాగునీటి సమస్య తీర్చేందుకు రూ.1,200 కోట్లతో ప్రాజెక్టు చేపట్టామని, ఏడాదిలోగా ఇది పూర్తవుతుందని చెప్పారు. నియోజకవర్గంలో నీటి సమస్య లేకుండా చేయడమే తమ ధ్యేయమని బ్రహ్మనాయుడు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చిన ఎమ్మెల్యే బొల్లా

ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రార్థనా మందిర నిర్మాణానికి సోమవారం సాయం అందించారు. పేరూరుపాడు గ్రామంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఆ సందర్భంగా తమ కాలనీలో ప్రార్థన మందిరం నిర్మిస్తున్నామని, నిర్మాణానికి రూ.3 లక్షల నిధులు అవసరమని ఎస్సీ కాలనీ పెద్దలు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆ మొత్తం ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రూ.3 లక్షలను సోమవారం అందించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ

నరసరావుపేట రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సుబ్బాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ విజయకుమార్, వైస్ ఎంపీపీ యాంపాటి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీ ప్రగతిని అధికారులు వివరించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాసిన్ తెలిపారు. ఇప్పటికే బోర్లు మరమ్మతులు చేసినట్టు వివరించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు వెల్లడించారు. సమావేశంలో పీఆర్ డీఈ కె.హరనాథ్, రూరల్ ఆర్ఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ సుబ్బాయమ్మ నుంచి పురస్కారం అందుకుంటున్న అల్లూరివారిపాలెం సర్పంచ్ నాగేంద్రం

పంచాయతీలకు పురస్కారాలు

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రామ పంచాయతీలకు మండల స్థాయిలో పురస్కారాలను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ యాంపాటి లక్ష్మీ పాల్గొన్నారు. తొమ్మిది విభాగాల్లో 27 గ్రామ పంచాయతీలకు ఈ పురస్కారాలను అందజేశారు.

ఈ-అభ్యాస్ ఐఐటీ ఫౌండేషన్ పోటీ పరీక్షల్లో ఏఎంజీ ప్రతిభ

చిలకలూరిపేటటౌన్: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఈ-అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సంవత్సరాంతపు పరీక్షల్లో ఏఎంజీ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఆరో తరగతికి చెందిన బి.స్రుజన్ మొదటి స్థానం, ఏడో తరగతికి చెందిన సీహెచ్ రాజేష్ రెండో స్థానం, ఎనిమిదో తరగతికి చెందిన భవనేశ్వర్ ప్రథమ స్థానం, తొమ్మిదో తరగతి చెందిన స్రవంతి నాలుగో స్థానం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ఏఎంజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏఎంజీ పాఠశాలలో ఐఐటీ ఫౌండేషన్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే పాఠశాలకు చెందిన విద్యార్థులు తొలి మూడు స్థానాలు సాధించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పి.మేరీ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృపాదానం పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంజీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ మహంతి

వైభవంగా గంగలమ్మ తిరునాళ్ల

శావల్యాపురం: వేల్పూరు గ్రామంలోని గంగలమ్మ తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు దోర్నా శ్రీనివాసరావు అమ్మవారి మూల విరాట్‌ను నూతన వస్త్రాలు, పూల దండలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారి సన్నిధిలో మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి పసుపు, కుంకుమ నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో నాగులపాటి గాలిబాబు కుటుంబ సభ్యులు, యాదవ్ యూత్ సభ్యులు మజ్జిగ ప్యాకెట్లు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఆయన తనయుడు బొల్లా గిరిబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు రెండు విద్యుత్ ప్రభలు, పౌరాణిక నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఎస్సై గల్లా రవికృష్ణ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు స్వర్ణాల వెంకటరావు, తూమాటి కబ్బారావు, ముంద్రు రాఘవరావు, ముంద్రు సాంబశివరావు, లింగా శ్రీనివాసరావు, సాదినేని చిన వెంకయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వైభవంగా షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: నాదెండ్లలోని షిరిడీ సాయిబాబా ఆలయ పదో వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి ఇర్లపాటి సాంబశివరావు ఉదయాన్నే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు జరిపారు. గణపతి, నవగ్రహ, అష్టోత్తర నామ, గోత్రనామ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.